క్లుప్తంగా

బాధితుడికి ఆర్థికసాయం



బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: విషపూరిత నీటిని తాగి 50 గొర్రెలు చనిపోయిన ఘటనలో క్రిష్టాపురం గ్రామానికి చెందిన కురువ మస్తాన్‌కు కురువ హక్కుల సాధన సమితి సంఘం అండగా నిలిచింది. సంఘం సభ్యులు తమ వంతు సాయంగా ఆదివారం రూ.35 వేలు, 7 గొర్రెలను అందజేశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బెలగల్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వం కూడా స్పందించి బాధితుడిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు డా.మద్దిలేటి, మోహన్ ప్రసాద్, దేవేంద్రప్ప, శివరాముడు, యుగంధర్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

22న పెంచికలపాడులో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో ఈ నెల 22న శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి మల్లికార్జునస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.

బీరప్ప దేవాలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు (న్యూటౌన్): పెద్దపాడు సమీపంలో నిర్మిస్తున్న బీరలింగేశ్వరస్వామి దేవాలయానికి ఆదివారం కర్నూలు మండలం జి. సింగవరం గ్రామంలోని కురువ కులస్తులు రూ.94,150 విరాళం అందజేశారు. కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, జిల్లా నాయకులు తిరుపాలు, పుల్లన్న, రాజు, నారాయణ, భాస్కర్, మహేష్, మల్లి, బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గరామేశ్వరుని సన్నిధిలో జిల్లా జడ్జి



కాల్వబుగ్గలో జడ్జి శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: కాల్వబుగ్గలో శ్రీ బుగ్గరామేశ్వరుడు, కొత్తూరులో శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆయా ఆలయాధికారులు, పాలక వర్గ సభ్యులు స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగులు

ఓర్వకల్లు: విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆ సంఘం నాయకులు రాధాకృష్ణారెడ్డి, జీవీ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి ప్రైవేట్ లిమిటెడ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. వందల మంది విశ్రాంత ఉద్యోగులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సంస్థ పెండింగ్ జీతాలు చెల్లించకపోవడంతో పలువురు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు.

రోడ్ల పనులు పూర్తి చేయాలి



బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఏఈ అచ్యుతానందరెడ్డి

కల్లూరు: మండలంలో చేపట్టిన రహదారి నిర్మాణ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఏఈ అచ్యుతానందరెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆదివారం 44వ జాతీయ రహదారి నుంచి జగన్నాథ గట్టు (లక్ష్మీపురం) వరకు వేస్తున్న బీటీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం రూ. 25లక్షల వ్యయంతో బీటీ రోడ్డు వేస్తున్నామన్నారు. అలాగే బస్తిపాడు గ్రామం ఎస్సీ కాలనీలో రూ. 5లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. ఆయా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టామన్నారు.

దేవాలయాలకు నవ్య శోభ

- ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రణాళికలు
- జిల్లాలో 13 గుడుల పునర్నిర్మాణానికి అనుమతులు
- రూ.11.43 కోట్ల విడుదలకు పరిపాలనా అనుమతులు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని పలు ఆలయాలు నవ్య శోభను సంతరించుకోనున్నాయి. ఆయా దేవాలయాల జీర్ణోద్ధరణకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. జిల్లాలోని 13 దేవాలయాలకు సంబంధించి ఆధునికీకరణ, పునఃనిర్మాణ పనులు చేపట్టేందుకు దాదాపు రూ.11.43 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కింద రూ.9,53,50,000, మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ కింద 1,90,70,000 నిధులు ఉన్నాయి. ఈనిధులతో ఆలయాల రూపు మారి అధునాతనంగా దర్శనమివ్వనున్నాయి.



పెరవలి రంగనాథ స్వామి ఆలయం



గద్దెరాళ్ల మారెమ్మ దేవాలయం

త్వరలోనే పునరుద్ధరణ పనులు ప్రారంభం



జిల్లాలోని 13 ఆలయాల్లో పునఃనిర్మాణ, ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు వచ్చాయి. త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు చేపడతాం. కామన్ గుడ్ ఫండ్‌తో పాటు ఆలయాల మ్యాజింగ్ గ్రాంట్ నిధులను కలుపుకొని నిర్మాణ పనులకు నిధులు వెచ్చిస్తాం. ఈ నిధులతో ఆలయాల రూపు రేఖలు మారతాయి. – ఆదిశేషు నాయుడు, సహాయ కమిషనర్, దేవదాయ శాఖ

పునరుద్ధరణకు కేటాయించిన నిధులు ఇలా..

- ఓర్వకల్ మండలం కన్నమడకల గ్రామం శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.40 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8 లక్షలు.
- ఓర్వకల్ మండలం నన్నూరు గ్రామంలోని శ్రీ లక్ష్మి సమేత మాధవ స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.10 లక్షలు.
- కర్నూలు నగరం కన్నప్ప చౌల్ట్రీలోని శ్రీ సత్య నారాయణ స్వామి కల్యాణ మండపం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.75 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.15 లక్షలు.
- కర్నూలు కుమ్మరి వీధిలోని శ్రీ రాంబొట్ల దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- కర్నూలునగరంలోని శ్రీకోట ఆంజనేయ స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- దేవనకొండ మండలం కప్పట్రాళ్లలోని శ్రీ కొలుట్ల చెన్నకేశవ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1.20 కోట్లు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.24 లక్షలు.
- గద్దెరాళ్ల గ్రామం శ్రీ గద్దెరాళ్ల మారెమ్మ ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1.15 కోట్లు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.23 లక్షలు.
- ఆస్పరి మండలం శంకరబండ గ్రామంలోని శ్రీ మాధవస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.43 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8.60 లక్షలు.
- మద్దికెర మండల పెరవళి గ్రామంలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- కోసిగి మండలం నేలకోసిగి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.27.50 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.5.50 లక్షలు.
- కోసిగి మండలం జమ్ములదిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.50 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.10 లక్షలు.
- నందవరం మండలం కనకవీడు గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.43 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8.60 లక్షలు.
- ఎమ్మిగనూరు మండలం గార్లదిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.40 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8 లక్షలు మంజూరయ్యాయి.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న కమిటీ కన్వీనర్ అయూబ్ అలీఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లాలోని అన్యాక్రాంతం అయిన, అవుతున్న వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అంజుమన్ ఎ ఇస్లామియా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ అండ్ వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్ కమిటీ కన్వీనర్ అయూబ్ అలీఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీ.క్యాంప్ సమీపంలోని మైనారిటీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలుతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ సంస్థల ఆస్తులు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నగరంలోని డాక్టర్ అబ్దుల్ యునాని ఆసుపత్రి, మెడికల్ కళాశాల, ది ఇస్లామియా అరబిక్ డిగ్రీ కళాశాల, ఉమర్ అరబిక్ హైస్కూల్, ఉమర్ అరబిక్ ప్రైమరీ స్కూల్, ఉర్దూ పాఠశాలలకు సంబంధించిన స్థలాలకు రక్షణ లేకుండా పోతోందని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కొందరు కమిటీ సభ్యులు వక్ఫ్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. నూతన కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు ఆస్తుల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జంషీద్ అలీ ఖాన్, మన్సూర్ అహ్మద్, జహంగీర్, సాహెబ్ అలీ బేగ్ పాల్గొన్నారు.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం



చిన్నావుల వెంకటరాజా రెడ్డిని సన్మానిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: తెలుగు కళం సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో నిర్వహించిన శోభకృత్ ఉగాది నామ కవి సమ్మేళనం అలరించింది. సమితి వ్యవస్థాపకులు కవి రాజ డాక్టర్ చిన్నావుల వెంకటరాజారెడ్డి అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో సాహితీ వేత్తలు ఆదవాని హనుమంతప్ప, డాక్టర్ వి.పోతన, స్వరూప్ సిన్హా, ఎలమర్తి రమణయ్య ప్రసంగించారు. శోభకృత్ నామ సంవత్సరంలో అన్నీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నారు. కవులు స్వర్ణలత, షేక్షావలి, నిర్మలకుమారి, కృష్ణమూర్తి, సత్యప్రసాద్, శ్రీధర్ మూర్తి, అజీజ్, సుశీలారాణి, దస్తగిరి, రఘు, తదితరులు కవితలు చదివి వినిపించారు. రచయిత్రి చంద్రమౌళిని సమన్వయకర్తగా వ్యవహరించారు. అనంతరం సాహితీ వేత్తలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ చాటండి



క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు

కర్నూలు (టౌన్): వచ్చే మే నెలలో నిర్వహించనున్న జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, కలర్‌బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి సమాజంలో ప్రతి విద్యార్థి, విద్యార్థినీ చదువుతో పాటు ఆసక్తి ఉన్న ఏదో ఒక క్రీడలో రాణించాలన్నారు. అదనపు అర్హతగా క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోలా ప్రతాప్, సుంకన్న పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎద్దుల బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దేశం తిరుపంరెడ్డి

వెలుగోడు: రోఖియాబీ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఆరు పండ్లలోపు విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దేశం తిరుపంరెడ్డి, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల జయపాల్ ప్రారంభించారు. పోటీల్లో పదకొండు ఎడ్ల జతలు పాల్గొనగా బోరోబుల్స్ చిన్న జత ఎద్దులు విజేతగా నిలువగా మొదటి బహుమతి రూ. 40,000 (దాత: శ్రీ దేశం తిరుపెంరెడ్డి, అంబాల ప్రభాకరరెడ్డి) అందజేశారు. బోరా బుల్స్(పెద్ద జత) రెండవ బహుమతి రూ. 30,000 (నందిరెడ్డి గారి రామిరెడ్డి, నందిరెడ్డి గారి వెంకటేశ్వరమ్మ), రంగాపూరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి ఎద్దులు మూడో బహుమతి రూ. 20,000 (ముంతల విజయభాస్కరరెడ్డి , బి. శివశంకర్ నాయుడు), జూపాడుబంగ్లాకు చెందిన ఈదుల విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దులకు నాలుగో బహుమతి రూ.15000 (ఎం.ఇలియాస్‌ఖాన్, గోవిందు, రమణ), పుసులూరుకు చెందిన గజ్జల శ్రీనిత్య వృషభాలు ఐదో బహుమతి రూ. 10000 (ఏపీపీ ఆసీఫ్ అలీఖాన్, ఉప సర్పంచ్ ముబీనా), మదాస్‌పల్లెకు చెందిన వెంకట మనోజ్, ప్రొద్దుటూరుకు చెందిన లక్ష్మీనారాయణ ఎద్దులు సంయక్తంగా ఆరో బహుమతి రూ.5000 (మోతుకూరు మాజీ సర్పంచ్ యం. నాగేశ్వరరెడ్డి) అందుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అమీర్ అలీ ఖాన్, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

23న బండలాగుడు పోటీలు

పాణ్యం: ఎస్. కొట్టాల గ్రామంలో ఈనెల 23వ తేదీన ఆరు పండ్లలోపు వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. శ్రీ హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలిచిన వృషభాల యజమానులు ముందుగా రూ.400ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే 24వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు సెల్: 9642517339, 6304594451, 9666954464కు సంప్రదించాలన్నారు.

పాణ్యం: ఉగాది పండుగను పురస్కరించుకుని ఈనెల 23వ తేదీన కొత్తూరు ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు సెల్: 9493252765, 8985029585, 9440616377కు సంప్రదించాలన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

సాక్షి నెట్ వర్క్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు, గూడూరు, సి. బెళగల్, కల్లూరు రెవెన్యూ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే వినతులు అందజేయవచ్చునని ఆయా మండలాల రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని వారు సూచించారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో ప్రతిసోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి సూచించారు ముడుచుకుపోయిన కాళ్లు, చేతులకు బాల్, ప్యాడ్స్‌పై వైద్యులు వ్యాయామం చేయిస్తారన్నారు. అలాగే ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు, బధిరులకు ఐఈఆర్‌టీ పరికరాలతో విద్యనందిస్తారని తెలిపారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం 1,060 క్యూసెక్కుల నీరు రాగా కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

డోర్ డెలివరీతో సమయం ఆదా

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణ సంస్థ ప్రవేశపెట్టిన కార్గో - కొరియర్ పార్సిల్స్ డోర్ డెలివరీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా వాణిజ్య సంస్థలు, మందుల దుకాణాలు, వ్యాపారస్తులు సమయాన్ని వృథా చేసుకోకుండా తమ పార్సిల్స్‌ను డోర్ డెలివరీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కర్నూలు నగర శివారులోని 10కిలో మీటర్లలోపు దూరంలో ఉన్న అడ్రస్‌లకు సేవలు అందుబాటులో ఉన్నాయని, 10 కేజీల్లోపు బరువు ఉన్న పార్సిల్స్ బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు.

ఆదర్శ విద్యా సంస్థల అధినేత సతీమణి మృతి

కర్నూలు సిటీ: ఆదర్శ విద్యా సంస్థల అధినేత బి.తిమ్మయ్య యాదవ్ సతీమణి బి.శారదమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్‌గా పని చేస్తూ రిటైర్ అయ్యారు. ఆ తరువాత శంకరాస్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కూడా పని చేశారు. వీరికి ఇద్దరు సంతానం. కొడుకు డా.హరికిషన్ ప్రస్తుతం శంకరాస్ డిగ్రీ కాలేజీ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. కూతురు బి.రమాదేవి ఉన్నారు. ఈమె మృతి పట్ల పలువురు సంతాపం తెలియజేశారు. అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు జరుగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



శ్రీవల్లెలాంబాదేవి ఆలయం

చదువుల తల్లి

వర్ధిల్లుతున్న శ్రీవల్లెలాంబాదేవి

- రేపటి నుంచి అమ్మవారి ఆలయంలో ఉగాది ఉత్సవాలు
- 22న రథోత్సవం, 23న పార్వేట



శ్రీవల్లెలాంబాదేవి అమ్మవారు

కోడుమూరు రూరల్: పట్టణంలోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబాదేవి చదువుల తల్లిగా వర్ధిల్లుతోంది. అమ్మవారి సన్నిధిలో చదువుకున్నా, ఆశీస్సులు పొందినా మంచి మార్కులొస్తాయని, ఉన్నత ఉద్యోగాలొస్తాయన్నది ఇక్కడి ప్రజల ప్రగాఢ విశ్వాసం. దీంతో ఈ ప్రాంతంలో ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు సిద్ధమయ్యే యువకులు అమ్మవారి ఆశీస్సులు తీసుకుంటారు. అలాగే పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు అమ్మవారి సన్నిధిలోనే అక్షరాభ్యాసం చేయిస్తుంటారు. ఏటేటా అమ్మవారిపై నమ్మకం పెరిగిపోతుండడంతో శ్రీవల్లెలాంబాదేవి ఆలయం సీమ బాసరగా విరాజిల్లుతోంది.

మొదటి వల్లె సమర్పించడంతో..

చాళుక్య రాజు సత్యాశ్రయుడు (క్రీస్తుపూర్వ 1036) కాలంలో శ్రీవల్లెలాంబదేవి ఆలయం నిర్మించినట్లు ఇక్కడి శిలాశాసనం ద్వారా తెలుస్తోంది. గ్రామంలో వస్త్రాలు వేసే వారికి ఈమె కుల దేవత అని వారు నేసిన మొదటి వల్లెను అమ్మవారికి సమర్పించేవారు గనుక వల్లెలాంబ అని ప్రతీతి. దేవాలయంలో నాటి పండితులు శిష్యులతో వేదాలు వల్లె వేయించేవారు గనుక ఈ దేవికి వల్లెలాంబ అని పేరు వచ్చిందనేది మరి కొందరి మాట. గొల్లాపిన్ని కవి పండితా వంశీయుడైన మోటప్ప నిరక్షరాస్యుడు. అందరూ ఆయనను ఎగతాళి చేస్తుంటే అమ్మవారు సంపూర్ణ అక్షరజ్ఞానం కలిగించి ఆ వంశానికి సంబంధించి ఏడు తరాలు పండిత పుత్రులుగా విరాజిల్లుతారని ఆశీర్వదించినట్లు గొల్లాపిన్ని వంశస్తుల కథనం. ప్రస్తుతం ఆ వంశస్తులు హైదరాబాద్, బెంగళూరు, నంద్యాల, అనంతపురం ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరు ప్రతి ఏటా ఉగాది ఉత్సవాలకు వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వెళుతుంటారు.

21 నుంచి ఉత్సవాలు ప్రారంభం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు శ్రీవల్లెలాంబాదేవి ఉత్సవాలు జరుగుతాయి. తొలి రోజు 21వతేదీ మంగళవారం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, గంగపూజ, సాయంత్రం ప్రభోత్సవం నిర్వహిస్తారు. 22వ తేదీ బుధవారం రథాంగ హోమం, సాయంత్రం అమ్మవారి రథోత్సవం, 23వ తేదీన పార్వేట జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి తెలిపారు.ఉత్సవాల నేపథ్యంలో భారీగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీవల్లెలాంబా దేవి ఉత్సవాల సందర్భంగా నేటి నుంచి ఆలయ వద్ద పలు క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 20న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన నాలుగు జట్లకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు,రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తారు. అలాగే 22న పొట్టేళ్ల పందేలు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి సహకారంతో ఈనెల 21 రేలా..రే..రేలా జంగిరెడ్డి జానపద నృత్యం, 22న స్వర్గీయ కోట్ల కళావతమ్మ జ్ఞాపకార్థం కోట్ల హర్షయాత్ సభ్యులు డ్యాన్స్ బేబి డ్యాన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

గస్తీ పోలీసులకు గంజాయితో దొరికిన విద్యార్థులు!

కర్నూలు: కర్నూలు నుంచి అనంతపురం జిల్లా గోరంట్ల సమీపంలో ఉన్న అగ్రికల్చర్ యూనివర్సిటీకి వెళ్తున్న విద్యార్థులు గస్తీ పోలీసులకు గంజాయితో పట్టుబడటంతో దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు, కర్నూలు, నంద్యాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ చదువుతున్నారు. ఇందులో ఒకరు నంద్యాల సెబ్ స్టేషన్ (ఎక్సైజ్)లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కుమారుడు. కానిస్టేబుల్ కుమారుడికి గంజాయి తాగే అలవాటు ఉండడంతో కొంత కాలంగా అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేసి తాగేవాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన విద్యార్థి పొలంలో గంజాయి మొక్కలు సాగు చేసి, మొక్కలను వాట్సాప్ ఫొటోలు చూపించడంతో కొనుగోలు చేసేందుకు అతను అంగీకరించాడు. మూడు రోజుల క్రితం నంద్యాల విద్యార్థికి చెందిన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం పెద్దమర్రివీడుకు వెళ్లి పొలంలో ఉన్న ఆరు కిలోల పచ్చి గంజాయిని బ్యాగులో వేసుకొని కర్నూలుకు వచ్చాడు. నంద్యాల చెక్ పోస్టు వద్ద కర్నూలు, నంద్యాలకు చెందిన ఇద్దరు విద్యార్థులను కలుసుకొని ముగ్గురు ద్విచక్ర వాహనంపై మూడు రోజుల క్రితం అర్ధరాత్రి అనంతపురం వెళ్తుండగా బ్లూ కోల్ట్స్ సిబ్బందికి అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేశారు. దీంతో పెద్దమర్రివీడుకు చెందిన విద్యార్థి బ్యాగులో గంజాయి బయట పడింది. దీంతో ముగ్గురినీ అదుపులోని తీసుకొని విచారించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వారి సెల్ ఫోన్లను పరిశీలించగా వాట్సాప్ చాటింగ్‌తో పాటు ఫొటోలు బయటపడ్డాయి. అలాగే ఎంత కాలం నుంచి వీళ్లమధ్యన ఈ వ్యవహారం సాగుతుందని కాల్ డాటా తీసి విచారిస్తున్నారు. అయితే కర్నూలుకు చెందిన విద్యార్థికి ఈ వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేదని విచారణలో తేలినట్లు సమాచారం. గంజాయితో పట్టుబడిన విద్యార్థులపై కేసు నమోదు చేసి జైలుకు పంపితే వారి భవిష్యత్తు నాశనం అవుతందని వారి తల్లిదండ్రులు పోలీసులను ప్రాధేయపడుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారి అనుమతితో ఒకటి రెండు రోజుల్లో వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుచనున్నట్లు సమాచారం.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఫెడరేషన్ నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.ఎల్లప్ప, జయరాజు

కర్నూలు సిటీ: యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా జె.ఎల్లప్ప, ఎస్.ఎం జయరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లా సహాధ్యక్షులుగా రవికుమార్, జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎస్.మారెప్ప, కోశాధికారిగా జి.హేమంత్‌కుమార్, కార్యదర్శులుగా నవీన్‌పాటి, ఎస్.ఇబ్రహీం, ఎం.లక్ష్మీదేవి, ఎస్.దావీదు, గాదిలింగప్ప, ఎ.దేవపాల్, నాగలక్ష్మీ, నరసింహులు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎస్.సి మద్దిలేటి, రాష్ట్ర కౌన్సిలర్లుగా పి.ఖాసిం, ఎం.నాగరాజు, కె.యేహోషువా, జి.శ్రీదేవిలు ఎంపికయ్యారు. నూతన కార్యవర్గ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ..ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసేందుకు ఓ ప్రణాళిక తయారు చేసుకుంటామన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ పాల్గొనగా, ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా వ్యవహరించారు.

సేవలోనే ఆత్మ సంతృప్తి



నిడ్జూరులో పేద వితంతువులకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): ఇతరులకు సేవ చేయడంలోనే ఆత్మ సంతృప్తి లభిస్తుందని ప్రజావాణి పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మాదిగ నడిపి గుండాలు అన్నారు. ఆదివారం కర్నూలు మండలం నిడ్జూరు, జి సింగవరం, ఎదురూరు, ఆర్‌కే దుద్యాల, ఆర్ కొంతలపాడు, సుంకేసుల, తులశాపురం, రేమట, ఉల్చాల గ్రామాల్లో పేద వితంతువులు, దివ్యాంగ మహిళలకు ఆయన చీర లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రతి సంవత్సరం 100 మందికి వివిధ రూపాల్లో సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజావాణి పరిరక్షణ సమితి సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తనలు అజరామరం



అన్నమయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: పద కవితా పితామహుడు అన్నమయ్య సంకీర్తనలు అజరామరమని సాహితీ స్రవంతి కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అన్నారు. అన్నమయ్య జానపద కళాక్షేత్రం సొసైటీ ఆధ్వర్యంలో కృష్ణానగర్‌లోని శ్రీనటరాజ నాట్య సంగీత అకాడమీలో ఆదివారం అన్నమయ్య 520వ వర్ధంతిని నిర్వహించారు. అన్నమయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం ద్వారా భక్తిని, సామాజిక స్ఫూర్తిని తన కీర్తనల్లో అన్నమయ్య నిక్షిప్తం చేశారన్నారు. అన్నమయ్య జానపద కళాక్షేత్రం సొసైటీ బాధ్యులు జే.ఎస్.శేషయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంగీత అకాడమి ప్రిన్సిపాల్ జి.నారాయణ స్వామి, కళాకారులు వెంకటరమణ, అరుణ, అనురాధ, మనీష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.